గోపీ - శ్యామ

"శ్రీ శిల్పి"

శ్యామ కూనిరాగాలు తీస్తూ కొత్త మొక్క పెట్టటానికి పాదు తీస్తూంది. గోపీ వచ్చి వెనుక నుల్చున్నది కూడా గమనించనేలేదు. "చూడు యిందాకట్నుండీ తవ్వుతున్నావు. ఒక్క రెండంగుళాలన్నా పైకి రాలా. ఉండు నేను తవ్వి చూపిస్తాను ఒక్కక్షణంలో" అంటూ శ్యామల చేతిలో నుండి తవ్వగాల తీసుకున్నాడు గోపీ.

"అబ్బా నీవు మహా తవ్వేశావులే. గోపీ! యిదో దొంతరి మల్లి. మా సుగుణ యిచ్చింది. ఇక్కడ్నుండీ చూడు. యెన్ని మల్లెపూలు పూయిస్తానో! " అంటూ మురుసుకుంది శ్యామల.

"అబ్బబ్బ ! మీ ఆడపిల్లలకి ఎప్పుడూ పూల గొడవే. నేను పెద్దవాడ్నయితే చూడు జపాను వరి పంట యెంత బాగా పండిస్తానో !"

"ఆడవాళ్ళేమిటి? నీకు తెలుసో లేదో స్విట్జర్లాండులో నట మగవాళ్ళు అల్లికలు నేర్చుకునే క్లబ్బొకటుందిట"

"వుష్ ! వాళ్ళొట్టి దద్దమ్మలై వుండాలి. అయితే"

"నీకు చేతకాకపోయినా అందర్నీ దద్దమ్మలంటావు నీవు"

"అలాంటి పనులు అసలు మనం చేయంగా" అంటూ చంకలు కొట్టుకుంటూ లేచేడు. శ్యామల మాట్లాడకుండా దొంతరమల్లి పాదులో పెట్టి చుట్టూ గట్టు కట్టింది. "శ్యామా" అంటూ పిలిచిన వాళ్ళమ్మ పిలుపు విని యింట్లోకి పరుగెత్తింది.

*　　　*　　　*

"యేం! శ్యామా, యివేళ నీవూ ఆలస్యంగా వస్తున్నావేం మీ స్కూల్లో ఆటలా?"

"లేదు గోపీ, మరేం..."

"ఊ చెప్పు. ఆగిపోయావేం?"

"నీవు అన్నిటికీ హాస్యం చేస్తావు. అందుకని"

"లేదులే. యీసారి చెయ్యనుగా"

"యేమీ లేదు. ఈసారి జరుగబోయే ముగ్గుల పోటీలకి మా స్కూలునుండి కొందర్ని పంపిస్తారట. ఈ రోజు ముగ్గులు వచ్చిన వారందరితో వేయించి అందులో బాగా వేసిన వాళ్ళని పంపిస్తున్నారు పోటీకి"

"నీవు పంపించే వాళ్ళ లిస్టులోకయినా వచ్చినట్లేనా?"

"ఇంతవరకు వచ్చినట్లే. ఆరుగురం వెళుతున్నాం మా స్కూల్లోనుండి. మా ఆరుగురిలోనే నాకన్నా బాగా వేసే వాళ్ళున్నారు. ఇంకా చాలామంది వస్తారుగా యీ పోటీకి"

"ఇవ్వన్నీ పనిలేని పనులు. లేకపోతే ముగ్గులేమిటి?"

"నీ వసలు యేపనీ పట్టుదలతో చేయలేవు. అసలు మొదలుపెట్టినా అది పూర్తి కానేకాదు. వెక్కిరించమంటే మాత్రం బాగా వెక్కిరిస్తావు. అందుకే అసలు నీకు చెప్పనన్నది. ముగ్గులూ ఒక కళే తెలుసా?"

"అవునవును. వెక్కిరించనన్నాను కదూ? మరిచిపోయానులే. శ్యామా ! మా యింటికి పోదాం రారాదూ?"

"ఇప్పుడు కాదు గోపీ, యిప్పటికే యీ రోజు ఆలస్యమైంది. మా అమ్మ పని చేసుకునే వేళ. తమ్ముడు యేడుస్తూంటాడు"

"ఉష్, నీకు తెగ ఓపిక బాబు. నాకు పిల్లలంటే చిరాకు"

"నీ వొక్కడివేగా మరి. చిరాకయినా నీకు సరిపోతుంది. అయినా మా చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ అంటే నాకెంతో యిష్టం. వాళ్ళు నాకోరకు యెప్పుడో యెదురు చూస్తుంటారు" అంటూ శ్యామ వాళ్ళింటి దగ్గర సందు వస్తే అటు దారి పట్టింది.

*　　　*　　　*

శ్యామల, గోపాలరావు దూరపు బంధువులు. గోపీ తండ్రి ఫిజిక్సు ప్రొఫెసర్గా చేస్తూ చనిపోయారు. చిన్నతనం నుండీ గోపీని వాళ్ళమ్మ రామాయమ్మ గారే యే లోటూ లేకుండా పెంచుకొస్తూంది. వాళ్ళకి సొంత వూళ్ళో ఆస్తి వుండటం వల్ల, గోపీ ఒక్కడే కావటం వల్ల వాళ్ళ కుటుంబానికి యే లోటూ లేదు. గోపీని అల్లారు ముద్దుగా

పెంచటం వల్ల అంతగా యెవరి భయం లేకపోవటం చేత అల్లరిగా తయారవుతాడేమోనని వాళ్లమ్మకి కొంచం భయం. నిజానికి గోపి తెలివిగలవాడే. కొంచం తొందర మనిషి, అదీ కాక తనకేలోటూ లేకపోవటం వల్ల, ఒక్కడే కావడం వల్ల, యెదటి వాళ్ళ బాధలు అంతగా అర్ధంకావు. శ్యామల తెలివైన పిల్ల, నెమ్మది, ఆలోచనా వుంది. శ్యామల స్నేహం వల్ల గోపీ తొందర పాటూ, కొంటెతనం తగ్గుతుందని రామాయమ్మగారు వాళ్ళిద్దరి స్నేహం ప్రోత్సాహిస్తుంటుంది. శ్యామలా వాళ్ళది సామాన్యమైన కుటుంబం. పొదుపుగా వున్నా అయిదుగురు పిల్లలవటం వల్ల అప్పుడప్పుడు కొంచం కష్టంగానే వుంటుంది. శ్యామలే పెద్ద పిల్ల. తతిమా వాళ్ళు యింకా చిన్నవాళ్ళే. ఇంట్లోవున్న సమయంలో తల్లికి సాయం చేస్తుంటుంది శ్యామల. జాలి, ఓరిమి శ్యామల సొమ్ములు. తల్లి తొందర పనిలో విసుక్కున్నా యెదురు చెప్పకుండా తనపని తాను చేసుకుపోతుంది.

* * *

ఒక ఆదివారం మధ్యాహ్నం అందరూ టీ తాగేక శ్యామల వాళ్ళమ్మతో అంది "అమ్మా! గోపీ వాళ్ళింటికి వెళ్ళొస్తానే"

"అవును, అన్నట్టు రామాయమ్మ గారింటికి నేనూ వెళ్ళి చాన్నాళ్ళయింది. ఈ మాయ పనుల్లో నాకు తీరదాయె. కొంచంసేపాగు నేనూ వస్తాను" అని పని మనిషిని పిల్లలకి సాయంగా వుండమని చంటి వాడిని తీసుకుని శ్యామలతో బయలుదేరింది. గుమ్మంలోనే గోపీ వాళ్ళ కుక్క యెదురై తోకాడిస్తూ స్వాగతమిచ్చింది. మిషను కుట్టుకుంటున్న రామాయమ్మగారు తలెత్తి చూచి నవ్వుతూ "రండి—రండి" అంది లేస్తూ. "ఏదో పనిమీదున్నట్టున్నారు?" అంది శ్యామల తల్లి. "ఏమీ లేదండీ, మా గోపీ పుట్టిన రోజు వస్తుంది కదండీ, చిన్నవాళ్ళు సరదా కదా, పిల్లల్ని పిలుద్దామనుకుంటున్నా ఆ రోజు. వాడికి కొత్త బట్టలు కుడుతున్నాను." "నయమేనండీ, మగపిల్లల బట్టలు కూడా బాగా కుడతారు మీరు. నాకు ఆడ పిల్లలవేగాని మగ పిల్లల షర్టులూ అవీ కత్తిరింపు చేతకాదు. పైగా చేతికుట్టు, నా యింట్లో పనుల మీద యేది నేర్చుకుందామన్నా తీరదు."

"ఆ! యివి మాత్రం యేమంత కష్టం లెండి. అయినా నాకు బోలెడంత తీరిక. మీకు అయిదుగురు పిల్లల మీద తీరదు మరి. యెప్పుడైనా తీరిక చేసుకుని మా మిషన్ మీద కుట్టుకుని వెళ్ళండి. చేతికుట్టు మరీ ఆలస్యం మీకు. యేం! శ్యామా! ముగ్గుల పోటీకి వెళుతున్నావట కదూ? మావాడు అంటున్నాడు మొన్న. మీ శ్యామలయెలాగయినా బుద్ధిమంతురాలండీ, నెమ్మది కూడాను!"

"తన తరువాత నల్గురు పిల్లలున్నప్పుడు నెమ్మది కాకపోతే యెలా చెప్పండి. అయినా అది పట్టక పట్టక పడితే గట్టి పట్టే పడుతుందిలెండి!"

ఈ చివరిమాట వస్తున్న గోపీ చెవిన పడింది. "అది కాదే అమ్మా, మీరంతా శ్యామ నెమ్మది, నెమ్మది అంటారు. కానీ నాతో ప్రతి దానికి వాదమేనే. మీ దగ్గరే నెమ్మదిగా పిల్లిలా వుంటుంది" రామాయమ్మగారు నవ్వుతూ "అవును నీలాంటి పెంకి వెధవ దగ్గర మెత్తగా వుంటే యెలాగు? శ్యామ తెలివైంది" అంది. దాంతో "ఉష్" అనుకుంటూ గోపీ అక్కడ్నుండి వెళ్ళిపోయాడు. శ్యామ గోపీ వెనకే వెళ్ళింది. రామాయమ్మగారు, శ్యామ తల్లి వాళ్ళ సంసార గొడవల్లో పడ్డారు.

* • *

శ్యామ వాళ్ళ చెల్లి చిట్టికి తల దువ్వుతూంది. గోపీ శ్యామని వెతుక్కుంటూ అక్కడికే వచ్చాడు. ఈ రోజు శ్యామని బాగా యేడిపించాలన్న సరదాతో వస్తున్నాడు గోపీ. శ్యామ ముఖంలోకి చూస్తూ "అమ్మాయిగారి మొహం ఈవేళ అమావాశ్య చంద్రుడులా ప్రకాశిస్తుందేం? నాకు తెలిసిందిలే మా కమలం చెప్పింది. మీ ముగ్గుల పోటీలు..."

"అవున్లే నిన్నెవ్వరూ యెత్తి పొడవమన్లే. ఆనాడే చెప్పేగా, నా కంటే బాగా వేసేవాళ్ళున్నారని. నేనే మొదటి దానిగా వస్తానని నే నేమీ గొప్పలు చెప్పుకోలేదు. నీవే యిలాంటి పోటీల్లో పాల్గొంటే చివరి నుండీ మొదటి వాడుగా వస్తావు"

"ఓ, మనం వెళితేగా?..."

"నీవసలు మొదలూ పెట్టవు, పెట్టినా పూర్తి చేసే పట్టుదలా లేదు" అందే కాని నిజంగా గోపీ యేదయినా చేయా

లనుకుంటే తెలివి తేటలూ సమర్థతా వుందనీ, గోపీకి అన్నీ మంచి వూహాలు తడతాయనీ శ్యామకీ తెలుసు. గోపీ అనుకున్నాడు. 'శ్యామ నన్నొట్టి పనికిరాని వాడ్ననుకుంటుంది. నిజంగానే శ్యామకన్నా నాకు పట్టుదల తక్కువే. ఇంకనుండీ యే పనైనా పట్టుదలగా చివరి వరకూ చేయటం నేర్చుకోవాలి' మనస్సులో నిశ్చయించుకున్నాడు. కానీ శ్యామని యింకా యేడిపించాలన్న బుద్ధిమాత్రం పోలా. తనకి నచ్చిన పనులైనా సరే శ్యామల చేస్తూంటే వెక్కిరించటం గోపీ కొక సరదా. "పోనీగాని శ్యామ యింత చిన్న దానికే" "ఛప్, నేనేం చిన్నబోలేదు. నీకొ్కదూ చెప్పేదీ" శ్యామకి తను వోడిపోయినందుకు అసలు విచారంగా లేకపోయినా గోపీ చేస్తున్న గొడవకి కొంచం కోపం వచ్చింది. అసలు యీ సంగతి గోపీకి చెప్పటం తనదే తప్పనుకుంది. ఈ సారి ఏ పోటీకి కూర్చున్నా గోపీకి ఒక్క పిసరైనా చెప్పకూడదనుకుంది. శ్యామ ఆలోచిస్తూంటే గోపీ తెగ వాగేస్తున్నాడు. ఇంతసేపూ తానే మాట్లాడేస్తున్నట్లు గుర్తొచ్చి "శ్యామా... శ్యామా...... మూగనోం పట్టేవులా వుందే? పైగా చిన్నపోలేదంటావేం?" దాంతో శ్యామకి అభిమానం ముంచుకొచ్చి మామూలు ధోరణిలో మాట్లాడ్డం మొదలు పెట్టింది. గోపీ, "శ్యామా రేపు మనం సినిమాకు వెళదామా?" అని అన్నాడు.

"అమ్మని కనుక్కుంటా. కాని వీళ్ళు ఎన్నాళ్ళనుంచో పిల్లలకి వేరే సినిమాలు తీస్తే బాగుంటుందంటారు కాని ఆ పని యెంతకీ చేయరు. మనకి సరిపోయే సినిమాలయితే బాగుంటుంది కదూ?"

"నిజమే మరి. యెప్పుడో తీస్తారు. చెప్పగానే చేస్తే యెలాగు?" ఈలోగా శ్యామ తమ్ముడు యేడుపు మొదలు పెట్టాడు. రేపు తప్పక వెళదాం అంటూ గోపీ యింటికి వెళ్లిపోయాడు.

*　　　*　　　*

కమలం, గోపీ పినతల్లి కూతురు. శ్యామతోనే ఫస్టు ఫారం చదువుతూంది. కమలంకి శ్యామ అంటే అంతగా గిట్టదు, దానికి కారణాలూ వున్నాయి. తన అన్న అయిన గోపీ శ్యామ అంటేనే యెక్కువ యిష్టంగా వుంటాడు. శ్యామ స్కూల్లో అందరితోనూ మంచిగా వుంటుంది. యెవరికే సహాయం చేయాలన్నా ముందు వుంటుంది. అందువల్ల స్కూల్లో అందరికీ శ్యామంటే యిష్టంగా వుండుట కమలకి అంతగా గిట్టేదికాదు. అదీకాక తను శ్యామ కన్నా తెల్లగా వున్నా అంతా శ్యామనే కళగా వుంటుందనటం ఓర్వలేకపోయేది. రామాయ్ పెద్ది కూడా అదేమాట! స్కూల్లో కూడ అసలు కమలకి ఓర్వలేని తనం అంటారు. రామాయమ్మగారు గోపీ పుట్టినరోజుకు పిలుపు కని చెల్లెలిగారి అమ్మాయి అవటంవల్ల కమలానికి కబురం పించింది. తప్పని సరిగా శ్యామలా వాళ్ళింటికూడా పిలుపుకు వెళ్ళవలసి వచ్చింది కమల. దానికి తగ్గట్లు, శ్యామ యింట్లోలేదు. వాళ్ళమ్మ వచ్చి చెప్పింది. "గోపీ సినీమాకు వెడదామన్నాడట. మా శ్యామ 'జ్యూ' కివెళ్ళాలని, యిద్దరూ వుదయం వాదించుకుంటున్నారు. చివరికి 'జ్యూ'కి వెళ్ళి చాన్నాళ్ళయిందని అక్కడికే వెళ్ళారు. అడక్క అడక్క అడిగితే వాళ్ల నాన్నగారు కాదనరు. వచ్చే వేళయింది కూర్చోమ్మా. నీ మెళ్ళో పతకం బాగుంది, యెక్కడ చేయించారో?" అందావిడ. దానికి కమల గొప్పగా "మా నాన్నగారు ఢిల్లీనుండి తెచ్చేరు. చాలా అయింది. నాకు తెలీదు" అని బింకంగా అంటూండగా శ్యామా, గోపీ రానే వచ్చేశారు. గోపీ అందుకుని "అదేమిటే చెల్లాయ్ పిన్ని క్రిందటి నెలలో యిక్కడేగా కొంది" అనేశాడు. దాంతో కమల ముఖం యెర్రబడిపోయింది. గోపీని మనస్సులో తెగ తిట్టుకుంది. శ్యామ ముందు అంత పరాభవం జరగటం భరించలేక పిలవటంకూడా మరిచిపోయి అక్కణ్ణుండే పరుగు తీసింది. గోపీకి తన పుట్టినరోజు పిలుపుకి కమలం వచ్చిందని గుర్తొచ్చి రేపు తప్పక రావాలని శ్యామకి చెప్పి వెళ్లిపోయాడు.

గోపీ పుట్టినరోజు, శ్యామలకి యెంతో సరదాగావుంది. గోపీకని మధ్యలో గులాబీపువ్వు పెట్టి చుట్టూ దొంతర మల్లి చేర్చి అందంగా ఒక గుత్తి తయారు చేసింది చేతిలో పట్టుకునేది. తాను యిదివరకే టేబుల్ బట్ట ఒకటి కుట్టి వుంచింది. అది కనిపించక పోవటంవల్ల వెతికి తీసికెళ్ళేసరికి కొంచం ఆలస్యమైంది. రావలసిన వాళ్ళంతా వచ్చేసి వున్నారు. గోపీ స్నేహితులు కూడా వచ్చారు. ఇంకా

గోపీ — శ్యామ

శ్యామ రాలేదని యెదురుచూస్తున్న గోపీ యిప్పటికయినా వచ్చినందుకు సంతోషించాడు. కాని పైకి మాత్రం "ఇంత ఆలస్యంగా వచ్చేకన్నా మానీలేకపోయావూ!" అన్నాడు. "ఈరోజుకూడ వాదమేమిటిరా?" అని వాళ్లమ్మ సరిద్ది చెప్పింది. శ్యామల తాను తెచ్చిన పూలగుత్తి గోపీ చేతికిచ్చి, టేబుల్ బట్ట బల్లమీద పెట్టి వచ్చి కూర్చుంది. రామాయమ్మగారు రుచిగా తయారుచేసిన ఫలహారాలు అందరూ కబుర్లు చెప్పుకుంటూ తినటం మొదలుపెట్టారు. గోపీ స్నేహితులు యెన్నో నవ్వించే సంగతులు చెపుతూ అందరినీ నవ్విస్తున్నారు. అందులో ఒకడికి అందరూ చేరి తెనాలి రామలింగడని సార్థక నామం పెట్టారు. అతడు మాట్లాడే ప్రతీమాటా అందరికీ నవ్వు పుట్టిస్తుంది. అంతా తినటం పూర్తయ్యాక గోపీ స్నేహితుల్లో ఒకడు మురళీ వాయించాడు. సినీమా పాటలు, భావ గీతాలు చక్కగా మురళీ మీద వాయించాడు. ప్రక్కయింటి అమ్మాయి కర్ణాటక సంగీతం నేర్చుకుంటోందట. కంఠమంత బాగుండ లేకపోయినా లయ తాళం తప్పకుండా త్యాగరాజు కీర్తన పాడింది. కమలం స్కూల్లో డ్యాన్సు నేర్చుకుంటూంది. బాగానే చేస్తుంది కూడాను. గోపీ చెయ్యమనగానే లేచి భరతనాట్యం చేసింది. పెద్దజరీ పరికిణీ కట్టుకుని పాపిడి చిందలు, చక్కని నగలు పెట్టుకుని కమల నృత్యం చేస్తూంటే శ్యామ చాలా బాగుందనుకుంది. కమలానికి నిన్న జరిగిన పరాభవం ఫలితంగా శ్యామతో యింత వరకూ మాట్లాడలేదు. అయినా శ్యామ అలాంటి వాటిని పాటించదు. నృత్యం అయిపోగానే కమల దగ్గరకు వెళ్లి "ఈమధ్య నీ నృత్యం చూడలేదు కమలం. బాగాచేశావు" అని మెచ్చుకుంది. గోపీ యింతలో "శ్యామా, నీవు తప్పించుకుందామనుకుంటున్నావులావుంది, అదేమీ కుదరదు. నీవూ పాడాలి" అన్నాడు. శ్యామలకి యిందరిలో పాడాలంటే సిగ్గుగావుంది. అయినా తప్పలేదు. చివరికి నెమ్మదిగా తనకి చిన్నప్పుడు అమ్మ నేర్పిన పాట యెత్తి,

"మురళీ కృష్ణుడు పుట్టినప్పుడు,
విరుల వానలే కురిసినవీ,
మురళీ కృష్ణుడు నవ్వినప్పుడు,
తరపి వెన్నెలలు కురిసినవీ..."

అంటూ పాడింది. "గాత్రం బాగుందమ్మా, భయందేనికి? గాత్రం యింకా విప్పి పాడితే బాగుంటుంది" అని రామాయమ్మగారు అంది. ముందు ప్రోగ్రాం వేసుకున్నట్లు, అప్పటికి అంతా బీచికి వెళ్లాలని లేచారు. అంతా అనుకున్నట్లు సంతోషంగా గడిచిపోయింది. చీకటి పడక ముందే యెవరి యిండ్లకు వాళ్లు చేరుకున్నారు. శ్యామ ఇంటికి రాగానే చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ చేర్చుకొని జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది. తన భాగం చెల్లెళ్లు వాళ్ళ కొరకు పట్టుకొచ్చినవి వాళ్ళందరికీ పంచిపెట్టింది. దాంతో వాళ్ళూ గోపీ పుట్టిన దినం చూచినంతగా మురిసిపోయారు.

*　　　　*　　　　*

ఈ మధ్య పరీక్షలవటం వల్ల శ్యామ గోపీని తరుచుగా చూడ్డంపడలేదు. పరీక్షలయ్యాక తేలిగ్గా ఒక రోజు గోపీ యింటికి బయలుదేరింది. గోపీ తన గదిలో లేడు. రామాయమ్మగార్ని వెళ్ళి అడిగితే "వాడొట్టి తుంటరి వెధవయి పోతున్నాడమ్మా. వాడ్ని యేమీ అనక, నేనే సగం వాడ్ని పాడుచేసింది. ఆయన పోయిన దగ్గరనుండీ ఆయన సామాన్లు తీయకుండా ఆయన గదిలోనే వుంచేశాను. వాడు ఆ గది తాళాలు యెలా తీశాడో యేమో! అందులో అన్నీ చక్క బెడుతున్నాడు. ఆయన 'టెలిస్కోప్' పాడుచేసిపెట్టాడు. ఇలాగయితే లాభం లేదని యీవేళ కొంచం భయం చెప్పాను. దాంతో సాయంత్రం ఫలహారం కూడ తీసుకోలేదు. దొడ్లోవున్నాడేమో చూడమ్మా" అని గోపీమీద కేసు చెప్పింది. తోటలో గోపీ వుండే చోటు శ్యామకి బాగా తెలుసు. తోటలో జామిచెట్ల కొమ్మల మధ్య కనిపించాడు అనుకున్నట్టుగానే. వెనకనుండి అంది శ్యామల "యేమండీ! తమరు అపరగలలియోలా టెలిస్కోపును పరిశోధిస్తున్నారటగా?" గోపీ తిరిగి కను బొమలు చిట్లించి కోపంగా చూచాడు. "సరేగాని గోపీ, మీ నాన్నగారి గదిలో అంత పనేం వచ్చింది నీకు? నేను చెప్పలేదూ? యేదో ఒకటి చెడగొట్టటమే నీ పని"

"ఉఁహ్, నిన్నెవ్వరూ యిక్కడ తీర్పు చెప్పటానికి రమ్మనలా" అని గర్జించాడు. శ్యామల అనుకుంది యిలాంటి సమ

యంలో ఆవిషయం మళ్ళా యెత్తటం మంచిదికాదని, తరువాత కనుక్కోవచ్చు, ముందు పాపం ఆకలి వేస్తుందిలా వుంది అని ఆలోచించింది. ఇంకా యేవేవో సంగతులు చెప్పి ఆ విషయం మరిపించివేసింది. "మా యింటికి పోదాం గోపీ" అంది. కొంతసేపటి వరకూ అమ్మ కళ్ళకి దూరంగానే వుంటే మంచిదని గోపీ కూడా వెంటనే సరే అన్నాడు. శ్యామ తల్లి నైవేద్యానికి చేసిన పాయసం తెచ్చి గోపీకి పెట్టింది. "నాకాకలి లేదు శ్యామా" అని తప్పించుకోబోయాడు. కాని శ్యామ తల్లి వచ్చి "తప్పు నాయినా, దేవుడి ప్రసాదం వద్దన కూడదు" అనటంతో అసలే ఆకలిగా కూడా వుండటం వల్ల యింక వద్దన కుండా తినేశాడు. శ్యామ వాళ్ళమ్మ వచ్చి అందుకున్నందుకు లోలోపల సంతోషించింది.

* • *

పరీక్షలయినా కాదు, యెందువల్లో శ్యామ అసలు కనిపించటం లేదనుకున్నాడు గోపీ. తానేమో సాయింత్రం స్కూల్లో ఆటలవల్ల చాలా ఆలస్యంగా వస్తున్నాడింటికి. శ్యామ యింటికి వెళ్ళటమే పడటం లేదు. ఆటలని వుండకుండానయినా సరే యీ రోజు శ్యామ యింటికి వెళ్ళాలనుకున్నాడు. శ్యామ యింట్లో పాపం అంతా దిగులుగా వున్నారు. వాళ్ళ చిన్న చెల్లి చిట్టికి జ్వరం, విరోచనాలట. శ్యామకి చెల్లెళ్ళు తమ్ముళ్ళు అంటే యెంతో ప్రాణం. దీంతో దిగాలుపడి కూచుంది. చాల నీరసంగా వుంది చిట్టి, మూసిన కన్ను తెరువకుండా పడివుంది. "మీ డాక్టరు మంచివాడేనా?" అన్నాడు గోపీ శ్యామతో. "మంచివాడేనయ్యా, కానీ డాక్టర్లు చెయ్యగలిగినంత చేస్తారు, ఆపైన దేవుడే వుండాలి" అంది శ్యామ తల్లి దిగులుగా చిట్టి వైపు చూస్తూ. గోపీకీ యేమీ తోచలేదు. "పోనీ మా డాక్టరు గార్ని కూడా కబురు పంపమని అమ్మతో చెబుతానండీ" అన్నాడు. "యెందుకులే నాయనా" అంది ఆవిడ. ఇంతలో శ్యామ నాన్నగారు డాక్టరుతో సహా అక్కడికి వచ్చారు. డాక్టరుగారు చిట్టిని పరీక్ష చేసి "రేపు గడవాలండీ" అంటూ మందిచ్చి వెళ్ళిపోయారు. శ్యామ వాళ్ళమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. అది చూచి శ్యామ మరీ అధైర్యపడిపోయింది. గోపీ వెళ్ళేక వాళ్ళమ్మతో చెబితే "అయ్యో! మనకి తెలియనే లేదు. ఈరోజు యెలానూ చీకటిపడింది. రేపు వెళదాం" అంది. రెండో రోజు రామాయమ్మగారు, గోపీ కలసి శ్యామ యింటికి వెళ్ళే సరికి అంతా అయిపోయిందని తెలిసింది. ఇల్లంతా బోసిపోయినట్లుంది. యెక్కడివాళ్ళక్కడే కూర్చుండి పోయి వున్నారు. శ్యామ యేడ్చి యేడ్చి నీరసంగావుంది. చిట్టి మాటలూ, ఆటలూ గుర్తుకు వచ్చి శ్యామ వెక్కి వెక్కి యేడుస్తూంది. రామాయమ్మగారు, గోపీ వాళ్ళని యెంతో ఓదార్చారు. గోపీకి పిల్లలంటే యెప్పుడూ పట్టనిది చిట్టి చనిపోయాక చిట్టంటే తనకీ ప్రేమేనని తెలుసుకున్నాడు. "గోపీ! లా" అంటూ వచ్చీరాని చిట్టి ముద్దు మాటలు గుర్తుకు వచ్చి మనస్సులో కలచినట్లయింది గోపీకి. శ్యామ ఆ తరువాత చాలకాలం వరకు కుదుటపడలేదు. చిట్టిని గుర్తుకు తెచ్చుకొని దిగులు పడుతూ వుండేది. శ్యామకి కొంచం స్థలం మార్చితేగాని యీ దిగులు కొంచం తగ్గదనుకుంది వాళ్ళమ్మ. పండుక్కి రమ్మని శ్యామ తాతయ్య వాళ్ళూరునుండి జాబు వ్రాశారు. శ్యామ పెద్ద పిల్లల్ని యిద్దర్నీ పంపాలనుకుంది. గోపీక్కూడా సెలవలేకదా అని గోపీను కూడా పంపించమని వాళ్ళమ్మ నడిగి ముగ్గురినీ కలిపి గుమాస్తాతో తాతయ్యగారూరు పంపించింది. శ్యామా వాళ్లు వచ్చేరని వాళ్ల బంధువుల పిల్లలూ వాళ్ళూ అంతా తాతయ్యగారింటికి చేరటం మొదలుపెట్టారు. వాళ్ళందరి మధ్యా శ్యామ కొంచం కొంచంగా దిగులు మరిచిపోతూ వుంది. సంక్రాంతి పండుక్కి బొమ్మల కొలువులూ, పేరంటాళ్ళూ, చిన్న పిల్లలకి పండ్లు పోయటం అంతా సరదాగా గడిచిపోతూంది. గోపీ క్కూడా పల్లెటూరు మార్పు బాగుంది. తాతయ్యగారి చిన్న బ్బాయిలతో కలసి ప్రక్కనున్న అడవికి వెళ్ళుతూండటం గోపీకి చాలా వుత్సాహంగా వుంది. ఒక రోజు గోపీ తన 'యెయిర్ గన్' సరిచేసుకుంటుంటే ప్రక్క యింటి కుఱ్ఱవాడు "అది యిల్లా తేవోయ్, చూచి యిస్తా" అన్నాడు. గోపీ బిరగ్గా "వుండవోయ్, మురికి చేతులూ నీవున్నూ" అనేశాడు. దగ్గరే నిలుచున్న శ్యామ సూటిగా గోపీ వైపు చూచింది. ఆ కుఱ్ఱవాడు చిన్న బుచ్చుకుని వెళ్ళిపోయాడు. శ్యామ "యేమిటి గోపీ, నీవెప్పుడూ యింతే. నీలా అందరూ గొప్పవాళ్ళుగా వుండాలంటే యెలావుంటారు? నీలా మంచి బట్టలూ దర్జాలూ రావుమరి. ఆ అబ్బాయి పాపం చూస్తానంటే నీ 'గన్' యేం అరిగి పోతుంది?" అంది

కోపంగా. "సుభ్రంగా వుంటానికి గొప్పయేమిటి? నీవు మరీ 'సిస్టర్ నివేదిత'లా మాట్లాడుతావు. చూపించే వాడినేగా వాడు పారిపోకపోతే! నామీదే ఎప్పుడూ నేరం వేస్తుంటావు" అన్నాడు తన్ను తాను సమర్థించుకోవాలని. "నీకసలు గర్వంలే"అని విసురుగా యింట్లోకి వెళ్ళిపోయింది శ్యామ. ఇలాంటి చిన్న తగాదాలు వచ్చినా మొత్తం మీద సెలవలు బాగానే గడిచిపోయాయి. తాతయ్య అందరికీ మంచి బట్టలు కుట్టించారు. స్కూళ్ళు తెరిచే సరికి అంతా యిళ్ళు చేరుకున్నారు.

*　　　*　　　*

మామూలుగా స్కూళ్ళు, చదువుల్లో పడ్డారు మళ్లా. శ్యామకి స్కూల్లో చెప్పే పుస్తకాలే కాకుండా చిన్న చిన్న పత్రికలూ, పుస్తకాలు చదవటమంటే చాల ఆశక్తి. వాళ్ళ నాన్నగారు అందువల్ల 'బాల' మొదలైన పత్రికలు తెప్పిస్తుంటారు. బాల పుట్టిన దిన సంచికకు 'బాలవ్యాసాల పోటీ' అని చూచి దాని వివరాలన్నీ ఆత్రుతగా చదివింది. నెమ్మదిగా ఒక గట్టి నిర్ణయానికి వచ్చింది. కాని యీ సారి యీ విషయం యెవ్వరితోనూ అనదలచుకోలేదు. శ్యామకి యింగ్లీషు నేర్చుకోవాలన్న ఆశక్తి వున్నా తెలుగంటే యెంతో అభిమానం. ఇంగ్లీషులో 'లిటిల్ వుమెన్' మొదలైన చిన్న చిన్న పుస్తకాలు చదివి యెంతో సంతోషిస్తుంది. కాని తెలుగు సొంత భాష అవటం వల్ల చాలా పత్రికలూ చిన్న చిన్న పుస్తకాలూ చదవటానికి వీలుగా వుంటుంది. ఆశక్తికి తోడు, చదవటం వల్ల తన వయస్సుకు సరళమైన తెలుగు వ్రాయగలదు. ఈసారి బాగా ప్రయత్నించ దలచుకుంది. గోపీ కూడ యీ మధ్య యేదో ఆలోచిస్తున్నట్లు గమనించింది శ్యామ. అనుకోకుండా దానికి కారణం కూడా దొరికింది. ఒక రోజు గోపీ వాళ్ళింటికి వెళ్ళినప్పుడు గోపీ కనిపించక తోటలోకి వెళుతూంటే పందిరి దొడ్లో, ఒక చక్కని విశాలమైన కుంపటి, దాని ప్రక్కనే వింత వింత రాళ్ళు, మట్టి, యిసుక యింకా యేవేవో పెట్టి వుండటం చూచింది. రామాయమ్మగారు "ఈ మధ్య వాడు రాళ్లూ రప్పలూ అవీ యిక్కడ చేర్చి పెడుతున్నాడమ్మా. వాడి పన్లకు అర్థం వుండదు!" అంది. శ్యామ కొంచం ఆలోచించి చూచింది. తన ఆలోచనల్ని తనలోనే పెట్టుకుంది. గోపీతో తాను చూచిన సంగతి కూడా అనలేదు.

*　　　*　　　*

"శ్యామా !" అంటూ సంతోషం పొంగిపోతూ కేక వేశాడు గోపీ. శ్యామ కూడ యెందువల్లో ఆ రోజు సంతోషంగానే కనిపిస్తూంది. "శ్యామా ! యీ రోజు నీవు ఒకచోటికి రావాలి నాతో. యెక్కడికని అడక్కూడదు" "అడగొద్దంటే అడగటాన్కి. నాకేం పని? కానీ నీవెక్కడికి రమ్మంటే అక్కడికి రావటమేననుకున్నావా నా పని?" అంది. నిజంగా శ్యామ రానంటుందేమోనని గోపీ నిరుత్సాహ పడిపోయాడు. శ్యామ తల్లి దగ్గరకు వెళ్లి "ఇవేళ తోటలో ప్రదర్శనం జరుగుతుందండీ! శ్యామ రానంటూంది. వెళ్ళమని మీరు చెప్పండీ" అని అడిగాడు. "శ్యామా ! వెళ్లిరావే" అని కేక వేసింది వాళ్లమ్మ. గోపీ రహస్యం యిదివరకే కొంత వరకు పసి గట్టిన శ్యామకు పూర్తిగా దాని అంతు కనుక్కోవాలని కుతూహలంగానే వుండటం వల్ల కొంచెం బెట్టుసరి చేసినా, చివరికి వెళ్లటానికే సిద్ధపడింది. అక్కడ ఒకాయన చెట్లు చేమలు, పండ్లు, పూలు మొదలైన వాటిని గురించి వుపన్యసిస్తున్నారు. అవి వృద్ధి చేసుకునే విధానాలు వాటిలో వుండే అందం, వుపయోగం విశధంగా చెబుతున్నాడు. ఈ రెండు రోజులూ జరిగిన యీ ప్రదర్శనకు తోడ్పడిన వారిని అభినందించి ప్రదర్శన జయప్రదంగా జరిగిందని చెప్పారు. చివరికి యీ ప్రదర్శనలో అన్నిటిలోనూ మొదటి బహుమతులు పొందిన వారిని అభినందించారు. ఇందులో పిల్లలు కూడ శ్రద్ధ చూపి పాలొన్నందుకు సంతోషిస్తున్నామనీ, పిల్లల ప్రదర్శనలో మిక్కిలి నిపుణతగా ఒక కుంపటిలో చిన్న అడవిని అతి సహజంగా నిర్మించి అందులో చక్కని భావం జత గూర్చి 'ఆంద్రోక్లెసు అండ్ ది లైన్'ని పొందు పరచిన చిరంజీవి గోపాలరావుకు మొదటి బహుమానం యీయబడిందని తెలియ జేశారు. తరువాత బహుమానాలు యిచ్చారు. శ్యామని తీసుకెళ్ళి తన 'అడవి'ని చూపించాడు గోపీ. నిజంగా చాలా సహజంగా అది అమర్చి వుంది. ఒకమూల చిన్న గుహ, అచ్చు గుహలా తయారయివుంది. అడివి అంతా అడివిలో వుండే చెట్లవంటి చెట్లతోనూ, దుబ్బులతోనూ, పొదల

తోనూ నిండి వుంది. అక్కడక్కడ అడవి పూలతో యెంతో ముచ్చటగా వుంది. గుహకు ఒక ప్రక్కగా చిన్న సింహం బొమ్మ దాని కాలు పట్టుకున్నట్లు ఆంద్రోక్లెసు ముల్లు తీస్తున్నట్లు అమర్చి వుంది. చెట్ల కొమ్మల మధ్య నుండి కనిపించీ కనిపించనట్లుంది యీ దృశ్యం. శ్యామ కనురెప్ప వేయకుండా చూచింది. నిజంగా గోపీ తెలివి వుపయోగించి ఓర్పుగా తయారుచేశాడనుకుంది. "చాలా బాగుంది గోపీ!" అని మెచ్చుకుంది. కాని నాకు తెలీకుండా యెప్పుడు తయారుచేసేవని అడగలేదేమా, ఆశ్చర్యపోయినట్లు లేదేమా అని విస్తుపోయాడు గోపీ. ఆ రెండవ రోజు ఒక ఉత్తరం వచ్చింది గోపీకి. యెక్కడ నుండి అయివుంటుందా అని ఆలోచిస్తూ విప్పి చదివాడు. "ఈరోజు మధ్యాహ్నం ఆట విడుపు రేడియోలో వింటావు కదూ?" 'శ్యామ' అని వుంది. ఆశ్చర్యపోయాడు. 2-15 ఎప్పుడవుతుందా అని యెదురు చూస్తూ కూర్చుని ఆతృతగా విసటం మొదలు పెట్టాడు. మామూలుగా ప్రోగ్రాం నడుస్తూంది. కొంత సేపటికి, రేడియో అక్కయ్య చెప్పింది "బాల పుట్టిన దిన సంచికకు పంపిన వ్యాసాలలో మొదటి బహుమానం కుమారి శ్యామలకు వచ్చింది. వ్యాసం చక్కని భాషలో ముచ్చటగా వుంది. శ్యామలే మీకు చదివి వినిపిస్తుంది. యేదమ్మా శ్యామలా, యిలారా" అంది అక్కయ్య. శ్యామల గొంతుక రేడియోలో నుండి సూటిగా వచ్చి గోపీ చెవుల్లో పడు తోంది. "శ్యామల యెంత తెలివిగా వ్రాసింది!" అని ఆశ్చర్యపోయాడు. ప్రోగ్రాం అయిపోయింది. అంతా కలలా వుంది గోపీకి. తనకి చెప్పకుండానే వ్రాసిందను కున్నాడు. శ్యామల అనుకున్నట్లుగానే సాయంత్రం తన యింటికి హాజరయినాడు గోపీ. ప్రశ్నల వర్షం కురుస్తూంది. "నీ వ్యాసం కాజేస్తా ననుకున్నావా?" అన్నాడు. "అహా, కాదుగోపీ, నీకుంపటి చూచికూడా నేను కాజేయలేదు. నీవు కాజేస్తావని ఎందు కనుకుంటాను?" అంది నవ్వుతూ. "ఆ! నా కుంపటి ముందే నీవు చూసేసావన్నమాట! నాతో చెప్పలేదేం మరి?"

"నీవు నాకు దాని సంగతి చెబితేగదూ అసలు. పైగా నా వ్యాసం ముగ్గుల్లాగ మూడోది కూడ రాకుండా పోగూడదూ? అలాగైతే నీ వెక్కిరింపులన్నీ వింటూ కిమ్మన కుండా కూచోవాలి!"

"శ్యామలా చాలా గట్టి దానివి. నాకు మొదటే బహుమానం వచ్చినా నీవు నన్ను ఓడించేసావులే. నేను చెప్ప కూడదని కాదు శ్యామా, నీవు యెప్పుడూ నన్ను ఒక్క పనీ పట్టుదలగా పూర్తి చేయనని అంటూంటావు కదూ! అందువల్ల పూర్తిచేసేక చెబుదామనుకున్నా" అంటూ యిద్దరూ తమ తమ పోటీలకు యేవిధంగా పంపిందీ పూసగ్రుచ్చినట్లు చెప్పుకున్నారు. ఇంక ఆ పోటీలూ అవీ అనుకున్నట్లు జరిగి పోయాయి. వాళ్ల తల్లి దండ్రులు యెంతగానో మెచ్చుకున్నారు. శ్యామా, గోపీ యింక పరీక్షలకు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని నిశ్చయించు కున్నారు. ★